# ప్రిన్సిపల్

యస్.యస్.సి పేపర్లు దిద్దడానికని విశాఖ వెళ్ళి తిరిగొస్తున్నాను.

కాంప్లెక్స్ చేరుకునే సరికి విజయనగరం వెళ్ళే ఫాస్ట్ పాసింజరు బయలు దేరడానికి సిద్ధంగా వుంది.

భుజం మీంచి వ్రేలాడుతున్న ఎయిర్ బేగ్‌ని పైకెగదోసుకుంటూ హడావిడిగా బస్సెక్కి సీటు చూసుకుని కూర్చున్నాను.

మరో ఐదు నిమిషాలలో సీట్లన్నీ ఫిలప్ అయిపోయాయి. కండక్టర్ రైట్ చెప్పడంతో బయలు దేరింది బస్సు.

విజయనగరం చేరుకోడానికి కనీసం గంటన్నరైనా బస్సులో కూర్చోవాలి. సమయం సునాయాసంగా సాగిపోవడానికి పుస్తక పఠనమే బ్రహ్మాస్త్రమని తోచడంతో బేగ్‌లోంచి వార పత్రిక తీసాను.

రెండు కథలు చదివానో లేదో బస్సు ఆనందపురం జంక్షన్ చేరుకుంది. అక్కడ జనం బాగా ఎక్కారు. అసలే వేసవి దానికి తోడు వోవర్ రష్‌గా వుండటంతో ఊపిరి తీసుకోడానికి మాకు ప్రాణవాయువు కరువైంది. ఉక్కపోతకు బట్టలు తడిసి పోతున్నాయి.

అక్కడ బస్సెక్కిన వారిలో తెల్లటి పైజామా షర్టు ధరించిన పొడవుగా బక్క పల్చగా వున్న వ్యక్తి నన్ను చూసి పలకరింపుగా చిరునవ్వు నవ్వాడు. అతగాడి నెప్పుడు ఎక్కడ చూసానో ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా స్ఫురణకు రావడం లేదు.

అలా కూర్చొండి ఎవరైనా ఆడవాళ్ళు ఎక్కినప్పుడు లేచి పోదురుగాని"

అన్నాను సభ్యత కోసం లేడీస్ సీటు ఖాళీగా వుంటే చూపిస్తూ...

తప్పు తప్పు స్త్రీలకు కేటాయించిన సీట్లను వారికే విడచి పెట్టాలి. అప్పుడే మన సభ్యత. సంస్కారం గోచరిస్తాయి." దాదాపు ఉపన్యాసమిస్తున్నట్లుగా అని ప్రక్కవాణ్ణి కాస్త సర్దుకోమని చెప్పి ఎడ్జస్టై పోయాడు.

అతగాడి మాటలే మిగిలిపోయాయి గాని మరెవరో ఆ సీట్లు క్షణాల్లో ఆక్యుపై చేసేసారు.

మళ్ళీ బస్సు కదిలింది.

కండక్టరుకు రెండు టిక్కట్లు షార్టు రావడంతో బస్సులో వున్న వాళ్ళందర్నీ తీసిన టిక్కట్లు చూపమన్నాడు. అతడి కోరిక మేరకు అందరం టిక్కట్లు అతడికిచ్చాం.

ఐతే పై జామా వ్యక్తి మాత్రం తన టిక్కటివ్వడానికి నిరాకరిస్తూ బస్సుమీద చూడమన్నట్లు సౌజ్ఞ చేసాడు.

అందరి దృష్టి బస్సుమీద పడింది.

సరియైన టిక్కట్టు తీసుకుని ప్రయాణించవలెను.

తీసుకున్న టిక్కట్టు కండక్టరు కివ్వరాదు. తనిఖీ అధికారులు అడిగినప్పుడు మాత్రమే చూపవలెను.

స్త్రీలకు కేటాయించిన సీట్లను వారికే విడిచి పెట్టవలెను.

పొగ త్రాగరాదు.

ఆర్.టి.సివారి సూచనలన్నీ ఆ వ్యక్తి తు.చ. తప్పకుండా పాటిస్తున్నందుకు ప్రయాణీకులు అతడిని అభినందించారు. ప్రతి వ్యక్తి అలాగే వుంటే స్టాఫ్ అవినీతికి పాల్పడ్డానికి గాని, సంస్థకు నష్టం రావడం లాంటివి జరగడానికి ఆవగింజంతైనా ఆవకాశ ముండదనుకున్నారు. మరి కొందరతడిని వెర్రి బాగులాడనుకున్నారు.

కండక్టరు ఎంత వత్తిడి చేసినా అతడు తన టిక్కట్టివ్వక పోయేసరికి, "అతనితో వాదనెందుకయ్యా, మిగిలిన వాళ్ళ టిక్కట్లు చూస్తే సరిపోలా. అతడు ప్రిన్సిపుల్సుకు కట్టుబడ్డ వ్యక్తినని చెప్తున్నాడు కదా" అన్నారెవరో పై జామా ధరించిన వ్యక్తిని సైడ్ చేస్తూ.

మరి చేసేదేమీ లేక కండక్టరు బస్సులో ఆ చివరి నుండి ఈ చివరి వరకు అభిమన్యుడిలా పాసింజర్సందర్నీ ఛేదించుకుంటూ ముమ్మారు చెక్ చేసి ఈమారు ఒక్క టిక్కట్టు మాత్రమే షార్టు వుందన్నాడు.

"ఇంత రద్దీలో నీకలా అనిపిస్తుంది. మరేం ఫరవాలేదు. మరోసారి లెఖ్ఖ చూసుకో అదే సరిపోతుంది" మరి మమ్మల్ని విసిగించకన్నట్లుగా చిరాగ్గా ముఖం పెట్టి అన్నాడు నా ప్రక్కన కూర్చున్న వ్యక్తి.

ఈమారు నాకు పుస్తకం చదవఖ్ఖర్లేకుండానే టైము పాసై పోతోంది.

బస్సులో అటు ఇటు తిరిగి అలసిపోయిన కండక్టరు ఉస్సూరుమంటూ తన సీట్లో కూలబడ్డాడు.

తగరపు వలస చేరేసరికి స్క్వాడ్ వచ్చి టిక్కట్లు చెక్ చేయడం కాకతాళీయంగా జరిగింది. ఒక టిక్కట్టు తేడా వున్నా ధైర్యంగానే వున్నాడు కండక్టరు.

తనిఖీ అధికారుల చెకింగ్‌లో టిక్కట్టు తీయని వ్యక్తి పైజామావాలా అని తేలేసరికి ప్రయాణీకులంతా ఆశ్చర్యపోతూ ముక్కుమీద వేలేసుకున్నారు.

"హారి పిడుగా! ఇన్ని శ్రీరంగ నీతులు వర్ణించి నువ్వు చేసిన పని ఇదా!" అనుకున్నాను నాలో నేను.

వంద రూపాయలు పెనాల్టి వేసి అతగాణ్ణి బస్సులోంచి దింపేసారు. అంత వరకు అతడి మాటల గారడీకి మంత్ర ముగ్ధులైన ప్రయాణీకులలో తిట్టనివారు లేరిప్పుడు.

అవినీతిని అరికట్టడానికి, ప్రయాణీకుల భద్రత కోసం ఆర్.టి.సి. వారు తయారు చేసిన సూచనలను తన అతి తెలివితో స్వప్రయోజనానికి వాడుకోవాలనుకుని ప్రయత్నించి పట్టుబడ్డ పైజామా వ్యక్తిమీద ఎవ్వరికీ సానుభూతి కలగలేదంటే నమ్మండి.

● *ఆంధ్రపత్రిక వారపత్రిక 24.7.87* ●